సాక్షి తిరుపతి

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



ఆధ్యాత్మికతతో పులకించి'నది'

శ్రీకాళహస్తి: కార్తీక మాసం, బహుళపక్షం, అనురాధా నక్షత్రం, అమావాస్య సందర్భంగా స్వర్ణముఖి నదికి హారతులు సమర్పించారు.



లక్ష దీపోత్సవం

చిట్టమూరు మండలం, మల్లం గ్రామంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో



జగన్ మళ్లీ సీఎం కావాలని..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ నాయుడుపేటలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

జనవరి 15 నుంచి రూ.3 వేల పింఛన్



ఆలయం వెలుపల మంత్రి గుడివాడ అమర్నాథ్

తిరుమల: జనవరి 15వ తేదీ నుంచి పెన్షన్ రూ.3 అందజేయనున్నట్టు మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ అందరూ సీఎం జగన్‌ను మరో సారి ముఖ్యమంత్రి చేయాలని ఆకాంక్షించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 64,882 మంది స్వామివారిని దర్శించుకోగా 24,900 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 5.28 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో రామారావు తెలిపారు. ఆలయంలోని ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను కూడా లెక్కించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయం ఉద్యోగులు, సిబ్బంది తప్పకుండా పాల్గొనాలని చెప్పారు.

16న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: స్థానిక ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 5 ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 40 ఏళ్ల వయస్సు లోపు ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177508279, 9966601867 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

17న భగవద్గీత కంఠస్థ పోటీలు

తిరుపతి కల్చరల్: గీతా జయంతి సందర్భంగా హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈనెల 17న ఆదివారం తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ పీఆర్‌ఓ టి.రవి తెలిపారు. తిరుపతి జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత మూడో అధ్యాయం కర్మయోగంలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. 6, 7 తరగతుల విద్యార్థులు, 8, 9 తరగతుల విద్యార్థులకు రెండు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. అదేవిధంగా 700 శ్లోకాలు కంఠస్థం వచ్చిన వారిలో 18 ఏళ్లలోపు ఉన్నవారికి ఒక విభాగంగా, 18 ఏళ్లు పైబడిన వారికి మరో విభాగంగా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు అన్నమాచార్య కళామందిరానికి చేరుకోవాలని సూచించారు. ఆయా పాఠశాలలు ప్రతిభ గల ఐదుగురు విద్యార్థుల వివరాలను ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అన్నమాచార్య కళామందిరం లేదా శ్వేత భవనంలోని హిందూ ధార్మిక సంస్థల కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి రూ.1000, రూ.750, రూ.500 ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారన్నారు. వివరాలకు 9676615643ను సంప్రదించాలని సూచించారు.

'ఆడుదాం ఆంధ్ర'కు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలాల్లోని అన్ని ప్రాంతాల్లో క్రీడామైదానాలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆ మేరకు క్రీడా పరికరాలను పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. కలెక్టరేట్ నుంచి డీపీఎల్‌డీఓ సుశీలాదేవి, డీఎస్‌డీవో సయనాథ్‌సాహెబ్, ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం వైఎస్ జగన్ తిరుపతికి రాక



తిరుపతి అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకోనున్నారు. తనపల్లె సమీపంలోని తాజ్ హోటల్‌లో శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరు కానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితో పాటు ఎస్పీ పరమేశ్వరరెడ్డి రేణిగుంట ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా విషయంలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వొద్దని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

బుధవారం మధ్యాహ్నం 4.15కు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో బయలుదేరి 5.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5.15గంటల వరకు ఎయిర్‌పోర్టులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం 5.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుని, శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. 5.45 గంటలకు తాజ్‌హోటల్ నుంచి బయలుదేరి, 6 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి గన్నవరానికి బయలుదేరి వెళ్తారు.



తాజ్ హోటల్ వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

శాస్త్రోక్తంగా కుంకుమార్చన

శ్రీకాళహస్తి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించిన కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చన, లక్ష బిల్వార్చన - లక్ష కుంకుమార్చన యోగ నిర్మల్యాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా స్వర్ణముఖి నదిలో కలిపారు. కార్తీక మాసం ముగియడంతో ఆలయంలో పలు రకాల పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చి అక్కడ వాటిని నదిలో కలిపారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.



యోగ నిర్మల్యాన్ని స్వర్ణముఖి నదిలో కలుపుతున్న అర్చకులు, అధికారులు



దైవం108 రూపేణా

• చిత్తూరు జిల్లా, చౌడేపల్లి మండలం, ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వసంత, రాజశేఖర్ దంపతులు సోమల మండలం, పెద్ద ఉప్పరపల్లి సమీపంలోని మామిడితోపులో కాపలా ఉంటారు. ఇక్కడకు ఎలాంటి దారి వసతి లేదు. సెల్ ఫోన్ సిగ్నల్ కూడా ఉండదు. మే 9న వసంతకు ఉన్నట్టుండి పురిటినొప్పులు మొదలయ్యాయి. గర్భిణి భర్త సెల్ సిగ్నల్ ఉన్న ప్రాంతానికి వచ్చి 108కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతికష్టం మీద మామిడి తోట వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గానికి కి.మీ దూరం ఉండడంతో స్ట్రెచర్‌పైనే గర్భిణిని మోసుకొచ్చారు. మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమవ్వడంతో మామిడితోటలోనే సుఖ ప్రసవం చేశారు. వసంత మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ సురక్షింతంగా ఆస్పత్రికి ఉన్నారు.



బిడ్డకు పురిటినొప్పులొస్తే తల్లిదండ్రులు ఠక్కున 108కు కాల్ చేస్తున్నారు. ఫోన్ చేసిన 10–20 నిమిషాల్లోనే సిబ్బంది కుయ్..కుయ్‌మంటూ వాలిపోతున్నారు. పల్లెకు దారిలేకున్నా లేక్క చేయడం లేదు. వాగులువంకలు అడొచ్చినా భయపడడం లేదు. ప్రాణాలను పణంగా పెట్టి అన్నింటినీ దాటి గమ్యానికి చేరుకుంటున్నారు. గర్భిణులను సురక్షితంగా ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను రక్షిస్తున్నారు. అత్యవసర సమయాల్లో మార్గమధ్యంలోనే పురుడు పోసి తల్లీబిడ్డను రక్షిస్తూ ఆపత్కాలంలో అండగా నిలుస్తున్నారు. కష్టకాలంలో 108 దైవరూపేణా తోడుగా నిలుస్తోందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



108 అంబులెన్స్

108లో ప్రసవం చేసిన సిబ్బంది



• తిరుపతి జిల్లా, భాకరాపేటకు చెందిన మీనాజ్ అనే గర్భిణి ఈనెల 12వ తేదీ రాత్రి పురిటినొప్పులతో తల్లడిల్లిపోయింది. వెంటనే కుటుంబీకులు 108ను ఆశ్రయించారు. ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే అంబులెన్స్ కుయ్..కుయ్ మంటూ బాకరాపేటకు చేరింది. వెంటనే గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకుని వెళ్లే క్రమంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. ఈ తరుణంలో అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించారు. సుఖ ప్రసవం చేసి తల్లీబిడ్డను రక్షించారు.

ఉమ్మడి జిల్లాలో 108 సేవలు విస్తృతం

- గర్భిణులకు సత్వర సేవలందిస్తున్న సిబ్బంది
- తల్లీబిడ్డ ప్రాణాల సంరక్షణే లక్ష్యం
- ఈ ఏడాది వాహనాల్లోనే 263 ప్రసవాలు
- హర్షంవ్యక్తం చేస్తున్న తల్లులు



108 అంబులెన్స్‌లో వైద్య సౌకర్యాలు



రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసింది. ఇందులో గర్భిణులకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఆపత్కాలంలో అమ్మకు అండగా నిలవాలని పరితపిస్తోంది. అందులో భాగంగానే జిల్లాలకు కావాల్సినన్ని 108 వాహనాలను సమకూర్చింది. అందులో అవసరం మేరకు సిబ్బందిని నియమించి, అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసింది. మాతాశిశు మరణాల నివారణ.. తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే యంత్రాంగం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 సేవలు విస్తృతం చేసింది. గర్భిణులు ఫోన్ చేసిన నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరేలా చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు 108 వాహనాల్లో జరిగిన ప్రసవాల్లో ఒక్క మాతాశిశు మరణం కూడా జరగకపోవడం విశేషం.

– సాక్షి, తిరుపతి డెస్క్

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేసింది. పేదలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే 108 సేవలను పటిష్టం చేసింది. ఈ క్రమంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 74 వరకు 108 వాహనాలు సమకూర్చింది. ఇవీ 24 గంటలూ పేదలకు అందుబాటులో ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేసింది.

ఫోన్ చేసిన 15 నుంచి 20 నిమిషాల్లో బాధితుల వద్దకు చేరేలా దిశానిర్దేశం చేసింది. రోజూ 800 నుంచి 1000 కి.మీ వరకు రయ్..రయ్‌మంటూ 108 వాహనాలు తిరుగుతుండగా.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం 1,03,884 మందికి సేవలంచాయి. ఇందులో 15,429 మంది గర్భిణులుండగా.. అందులో 263 మందికి 108 వాహనంలోనే సిబ్బంది పురుడు పోసి తల్లీబిడ్డను సంరక్షించారు.

పురుడు పోసుకున్న నవీన వైద్యం

గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన 108 అంబులెన్స్ సేవలను ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పటిష్టం చేశారు. మారుమూల పల్లెలకు సైతం అంబులెన్స్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టారు. మాతాశిశు మరణాల సంఖ్య తగ్గేలా.. ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు పురుడు పోసుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందులో భాగంగా 108లో స్త్రీల వైద్య నిపుణులను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి పరిధిలోకి అంబులెన్స్‌లను కేటాయించారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలెట్లను నియమించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ క్రమంలోనే వారు ఆపత్కాలంలో చాకచక్యంగా వ్యవహరిస్తూ సురక్షిత ప్రసవాలు చేసి తల్లీబిడ్డకు ప్రాణాలు పోస్తున్నారు.

తల్లీబిడ్డను కాపాడడమే లక్ష్యం



గర్భిణులను ఆస్పత్రులకు తరలించే సమయంలో పురిటి నొప్పులు ఎక్కువైతే అంబులెన్స్‌ల్లోనే పురుడుపోస్తున్నాం. అత్యవసర సమయాల్లో తల్లీబిడ్డను కాపాడడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఫోన్లు రాగానే సిబ్బందిని అప్రమత్తం చేసి పంపిస్తున్నాం. ప్రసవం విషయంలో అంత్యత జాగ్రత్తగా వ్యహరిస్తున్నాం.

– మోహన్‌బాబు, 108 చిత్తూరు జిల్లా మేనేజర్

మెరుగైన సేవలందిస్తున్నాం



జిల్లాలో 108 అంబులెన్స్‌ల ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం. గర్భిణులు ఫోన్ చేసిన 10–20 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరుకునేలా చర్యలు చేపట్టాం. మారుమూల ప్రాంతాల్లో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 108 అంబులెన్స్‌లోనే 263 ప్రసవాలు జరిగాయి.

– పి.శివ రాకేష్, 108 జోనల్ మేనేజర్

బండిలోనే ప్రసవం చేశారు



నాది పుట్టిన ఊరు చిత్తూరు మండలం, ముత్తుకూరు. గర్భవతిని అయ్యాక మా పుట్టింటికి వెళ్లా. అక్కడ పురిటినొప్పులు రావడంతో మా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. సరిగ్గా 15 నిమిషాల్లో ఊర్లోకి బండి వచ్చింది. ఊరు దాటే సమయానికి నొప్పులు అధికమయ్యాయి. వెంటనే సిబ్బంది స్పందించారు. ప్రసవం చేశారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నేను నా బిడ్డ ఇప్పుడు క్షేమంగా ఉన్నాం.

– కల్పన, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు మండలం

నా బిడ్డ సురక్షితం



నొప్పులు రాగానే కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. చేసిన కొద్ది సేపటికి బండి కుయ్..కుయ్‌మంటూ ఇంటి ముందు వచ్చి ఆగింది. భరించలేని నొప్పులు వస్తే 108 సిబ్బంది ఏం కాదని చెబుతూ ఆస్పత్రి వరకు సురక్షితంగా తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో డాక్టర్లు సుఖ ప్రసవం చేశారు. నేను నాబిడ్డ క్షేమంగా ఉన్నామంటే అందుకు 108 కారణం. ఇలాంటి సేవలు అందిస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– నందిని, దామినేడు, తిరుపతి జిల్లా

మాతృమరణాలు తగ్గుముఖం



108 రాకముందు సకాలంలో గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లలేక ఇబ్బంది పడేవారు. ఇంట్లోనే ప్రసవం జరగడం, ఆపై వైద్యసేవలు అందకపోవడంతో పదుల సంఖ్యలో మాతృమరణాలు జరిగేవి. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలైతే మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు అలా లేదు. 108 వచ్చాక గర్భిణులు నొప్పులొచ్చిన వెంటనే ఆస్పత్రికి చేరుకుంటున్నారు. మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికమైతే 108 సిబ్బందే సుఖ ప్రసవం చేస్తున్నారు. ఈ సేవలను రాష్ట్ర ప్రభుత్వం మరింత మెరుగ్గా నిర్వహిస్తోంది.

– శ్రీహరి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, తిరుపతి

సద్వినియోగం చేసుకోవాలి



తల్లీబిడ్డ సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. మాతాశిశుమరణాల కట్టడికి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే 108 సేవలు కూడా. ఇటీవల 102ను ప్రసవ సేవల వినియోగానికి తీసుకొచ్చింది. ఏ ఒక్క బిడ్డా చనిపోకూడదనే ఈ సేవ ముఖ్యఉద్దేశం. గర్భిణులు ఈసేవలను సద్వినియోగం చేసుకోవాలి. 108, 102 సేవలపై వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి.

– ప్రభావతీదేవి, డీఎంఅండ్‌హెచ్, చిత్తూరు

జర్నలిస్టులకు ఇంటిస్థలాలు గుర్తించండి

తిరుపతి అర్బన్: జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇవ్వడానికి అవసరమైన భూములను గుర్తించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్ జిల్లా కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత మాసంలో జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు నెం.535 రెవెన్యూ (లాండ్స్–1)శాఖ జారీ చేసిందని వెల్లడించారు. ఆమేరకు ఇంటి స్థలాలకు అవసరమైన భూములు త్వరితగతిన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి జాబితా కమిషనర్ ఐఅండ్‌పీఆర్ వారు పరిశీలించి.. జిల్లాలోని 137 మంది జాబితాను పంపారని వెల్లడించారు. ఆ మేరకు అవసరమైన స్థలాలు గుర్తించి, సేకరణకు సంబంధిత ఆర్డీఓలు చర్యలు చేపట్టాలని సూచించారు. స్థలాలకు సంబంధించి 60 శాతం ప్రభుత్వం హెచ్చిస్తుందని, 40 శాతం జర్నలిస్ట్ వాటా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీగా వెల్లడించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచల కిషోర్, ఆర్డీవో కిరణ్‌కుమార్, లక్ష్మీకాంత్, మోహన్‌ప్రసాద్, గురుప్రసాద్ శుక్ల, కన్వీనర్ ఎ.బాలకొండయ్య, డీపీఆర్‌ఓ విజయసింహారెడ్డి, డివిజనల్ పీఆర్‌ఓ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఫారం–7 తప్పని తేలితే క్రిమినల్ కేసులు

తిరుపతి అర్బన్: ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారం–7 తప్పని తేలితే క్రిమినల్ కేసులు తప్పవని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల నేతలతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ తప్పుగా ఫారమ్ –7ను ఓటు తొలగింపునకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 31 ఆర్‌పీయాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ మొబైల్, కంప్యూటర్ నుంచి ఫారం–7 తప్పుడు దరఖాస్తు సమర్పించారో ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడానికి పోలీస్ వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. ఫారం –7 క్షేత్ర స్థాయి పరిశీలనలో తప్పుగా తేలిన వాటిని సంబంధిత ఆర్ఓలు వెంటనే పోలీస్ శాఖకు అప్పగించాలని సూచించారు. ఈనెల 9 నాటికి అన్నిరకాల దరఖాస్తులు 4,11,164 అందాయని 2,348 మాత్రమే పరిశీలించాల్సి ఉందని వివరించారు. ఫారం- 6 –1477, ఫారం –7 –246 , ఫారం –8 , 607 దరఖాస్తులు మాత్రమే క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత చంద్రమౌళి, బీజేపీ నేత పురుషోత్తం నాయుడు, టీడీపీ నేత సుధారెడ్డి, సీపీఐ నుంచి నాగరాజు, నగరపాలక కమిషనర్ హరిత, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు రేపు

చిల్లకూరు: 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించే క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 14న గురువారం చిల్లకూరులోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్టు పీడీ శ్రీరేష్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఆయన ప్రిన్సిపల్ మీరా సాహెబ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలను తెనాలి, గుంటూరులో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఇందులో భాగంగానే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన సబ్ జూనియర్స్ బాలుర జట్టును ఎంపిక చేసేందుకు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో 01-01-2008లోపు జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు వివరాలకు 9704827095లో సంప్రదించాలని సూచించారు.

తిరుమలలో అధ్యయనోత్సవాలు ప్రారంభం

తిరుమల: శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 25 రోజుల పాటు జరుగనున్న అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుంచి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జియ్యంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీవైష్ణవులు పారాయణం చేస్తారు. కాగా, తొలి 11 రోజులను పగల్‌పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. 22వ రోజున కణ్ణినుణ్‌శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూత్రందాది, 24వ రోజున శ్రీవరాహస్వామివారి సాత్తుమొర, 25వ రోజున అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి. తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్న జీయర్‌స్వామి, టీటీడీ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు అధ్వానం.. నేడు కళాత్మకం

ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి. నాడు–నేడుతో కార్పొరేట్ స్థాయికి చేరాయి. బోధనలోనూ సమూల మార్పులొచ్చాయి. ఒకప్పుడు పెచ్చులూడి.. అధ్వానంగా ఉన్న బడులు నేడు కళాత్మకంగా కనిపిస్తున్నాయి. అడ్మిషన్లు క్రమంగా పెరుగుతున్నాయి. కార్పొరేట్ తలదన్నేలా విద్యార్థులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనం జేజేలు పలుకుతున్నారు. మేనమామగా తమ పిల్లలను చదివిస్తున్నారని కొనియాడుతున్నారు.

– తిరుపతి అర్బన్

జనవాణి



సిద్ధిరాజు కండ్రిగ స్కూల్, పిచ్చాటూరు మండలం

అడ్మిషన్లు పెరిగాయి



మా పాఠశాలలో గతంలో 50 మంది విద్యార్థులు ఉండేవారు. నాడు–నేడుతో పాఠశాల రూపురేఖలు మారాయి. మొదటి విడతలో రూ.19 లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ప్రహరీ గోడ, అధునాతన గదులు, తరగతి గదిలో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, బల్లలు వంటి సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు మా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇక్కడ చేరుతున్నారు. ప్రస్తుతం 97 మంది విద్యార్థులు ఉండడం సంతోషకరం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– గీతాదేవి, ఉపాధ్యాయురాలు, కేబీఆర్‌పురం, సత్యవేడు మండలం

ఇంగ్లిష్ చదువులు తెచ్చారు



దేశ విదేశాల్లో ఎక్కడకు వెళ్లినా ఈ రోజుల్లో ఇంగ్లిష్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ అంశాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ప్రైవేటు పాఠశాలలకు మించినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను మార్పుచేశారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేశారు. మంచి ఉపాధ్యాయలను నియమించారు. ఎంతో సంతోషంగా ఉంది. పైసా ఖర్చు లేకుండా ఇంగ్లిష్ చదువులు చదివిస్తున్నాం.

– పరమాల జయలక్ష్మి, విద్యార్థి తల్లి, చంద్రగిరి

మెరుగైన వసతులు



మా ఊరి పాఠశాల గతంలో పాడుబడి కూలే స్థితిలో ఉండేది. రేకులు షెడ్డు, తాగునీటి సౌకరం కూడా ఉండేది కాదు. మరుగుదొడ్లు లేక పిల్లలు అల్లాడిపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన బడి–నాడు నేడు పథకం ద్వారా మా పాఠశాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. మౌలిక వసతులు సమకూరాయి. సొంత మేనమామ మాదిరిగానే సీఎం జగనన్న తమ పిల్లలను చదివిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– పెనమాల భూదేవి, విద్యార్థి తల్లి, పాతనాలపాడు గ్రామం, దక్కిలి మండలం

పిల్లల భవిష్యత్‌కు గ్యారెంటీ దొరికింది



నా కురుడును నారాయణవనంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివేవాడు. నా భర్త మృతి చెందడంతో కుమారుడి చదువు భారంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా ఇంగ్లిష్ విద్య, సీబీఎస్ సిలబస్‌ను ఏర్పాటు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు మించినట్లు ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. ఉన్నత చదువులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడంతో మా పిల్లల భవిష్యత్‌కు ఢోకా లేదని భావిస్తున్నా.

–అమరావతి, విద్యార్థితల్లి, తిరువట్యం గ్రామం, నారాయణవనం మండలం

జగన్ మళ్లీ సీఎం కావాలని లక్ష దీపోత్సవం

నాయుడుపేటటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈద రత్నశ్రీ మంగళవారం నాయుడుపేటలో లక్ష దీపోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఓ రాధతో పాటు అనేకమంది మహిళలు, భక్తుల నడుమ లక్ష దీపోత్సవ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నశ్రీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ లక్ష దీపోత్సవ పూజలను జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో అరుణమ్మ, లాస్య, బిక్కిబాబు, కవిత పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవ పూజలు నిర్వహిస్తున్న రత్నశ్రీ, దీపిక, ధనలక్ష్మి, రాధ తదితరులు

టీటీడీ వెబ్‌సైట్‌ను ఆధునీకరించండి

– ఈఓ ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి(అలిపిరి): తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించే దిశగా అన్ని వివరాలతో వెబ్‌సైట్‌ను ఆధునీకరించాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో మంగళవారం స్థానిక ఆలయాలపై ఈఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ టీటీడీలో 60కి పైగా స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాలున్నాయని, వీటికి సంబంధించిన స్థలపురాణం, ఆర్జిత సేవలు, దర్శన వేళలు, ఇతర సౌకర్యాలను వెబ్‌సైట్‌లో భక్తులకు తెలియజేయాలని కోరారు. గతంలో కరపత్రాలు, విభిన్న పద్ధతుల్లో ప్రచార సామగ్రిని భక్తులకు అందుబాటులో ఉంచేవారమని, ఇటీవల భక్తులు డిజిటల్ మీడియా వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వెబ్‌సైట్‌ను ఆధునీకరించాలని సూచించారు. ఎస్వీబీసీ ద్వారా ఆలయ విశిష్టతకు సంబంధించి స్వల్ప వ్యవధితో వీడియో క్లిప్‌లు రూపొందించి వివిధ మాధ్యమాల్లో జనబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని కోరారు. దీంతో ఎక్కువమందికి ఆలయాల సమాచారం తెలుస్తుందన్నారు. సమావేశంలో జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, డిప్యూటీ ఈఓ(జనరల్) శివప్రసాద్, ఐటీ జీఎం సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ ఏవీ ధర్మారెడ్డి

ఆరోగ్యశ్రీపై బురద చల్లడం దారుణం

తిరుపతి తుడా: అనారోగ్య కారడవిలో దివిటీ లాగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆదుకుంటోందని, కానీ నేడు దురుద్దేశంతో ఓ వర్గపు మీడియా దానిపై బురదచల్లడం దారుణమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్ని కోట్ల మంది రోగాలకు కార్పొరేటు వైద్యాన్ని అందించిన ఘనత ఆరోగ్యశ్రీకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో కొన్ని వందల జబ్బులు ఆరోగ్యశ్రీ పరిధిలో లేవన్నారు. ప్రజలకు సాధారణంగా వచ్చే మొలలు, భగంధరము, వరిబీజము మొదలైనవి ఆరోగ్యశ్రీలో లేకపోవడం వల్ల పేదలు అప్పులు చేయాల్సి వచ్చేదని గుర్తుచేశారు. కానీ ముఖ్యమంత్రి జగనన్న అన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి పేదల పాలిట అపర ధన్వంతరిగా నిలిచారని కొనియాడారు. అంతేకాకుండా నాడు–నేడు ద్వారా ప్రాథమిక వైద్య కేంద్రాల నుంచి బోధనా ఆస్పత్రుల వరకు కార్పొరేటు వైద్యశాలలకు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం దేశంలోని 100 కోట్ల పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా బాసిల్లుతున్న విషయాన్ని మరువరాదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

కనులపండువగా లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవంలో భక్తులు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా ఆలయంలో లక్ష దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మూలంరాజు భానుప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో దశ సహస్ర జ్యోతి లింగార్చన మహోత్సవం చేశారు. రాత్రి స్వామి వారికి భక్తులు పుష్పయాగం నిర్వహించారు. ఆలయం వెలపల ఉన్న కోనేరులో మహిళలు కార్తీక దీపాలు వదిలి, తమ కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. కామాక్షీదేవి సమేత కోమలేశ్వర స్వామి, శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. శివలింగాలకు సాలగ్రామ అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. రాత్రి భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

35 ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- 22ఏ నిషేధిత జాబితా నుంచి ఇళ్ల స్థలాలకు విముక్తి
- మంగళంలో 1,564 మంది కుటుంబాలకు లబ్ధి
- మీడియా సమావేశంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి సిటీ: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో మంగళం ప్రజలకు 35 ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి మంగళంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్లను 1/1, 11/1లలో ఇప్పటి వరకు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల స్థలాలకు విముక్తి లభించిందన్నారు. మంగళం క్వార్టర్స్, సప్తగిరి కాలనీ, అంబేడ్కర్ కాలనీలలో 1,564 మందికి లబ్ధి చేకూరనుందని ఆయన స్పష్టం చేశారు. వారం రోజుల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తూ అర్హత పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. మూడు దశబ్దాలుగా ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణలో తీవ్ర జాప్యం నెలకొందని, 1984 నుంచి ప్రభుత్వాలు మారినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి నోచుకుందని చెప్పారు. జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందనేందుకు ఈ సంఘటన నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవకు అంకితమవుతానని ఆయన పునరుద్ఘాటించారు. చిందేపల్లిలో కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారం అయిందని, ఈ నెలలోపు ప్లాట్లు కేటాయించే అవకాశం ఉందన్నారు. ఇందుకు గాను తుడా నిధులు రూ.15 లక్షలు ముందస్తుగా కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఏళ్ల నాటి సమస్య పరిష్కరించినందుకు లబ్దిదారులు, పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. తుడా చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

నిరాధార వార్తలపై ఫిర్యాదు చేయొచ్చా?

- కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి సిటీ: ఒక వ్యక్తి, వ్యక్తులకు సంబంధించి మీడియాలో నిరాధార వార్తలు, వ్యతిరేక వార్తలు వస్తే అలాంటి వాటిపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవడానికి సరైన యంత్రాంగం ఉందా..? అని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. అలా లేనట్లయితే జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి యంత్రాంగాలను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. పార్లమెంట్ సమావేశాలలో భాగంగా మంగళవారం పలు ప్రశ్నలను లేవనెత్తారు. దీనిపై కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అనురాగ్‌సింగ్‌ఠాకూర్ స్పందించారు. వివిధ మాధ్యమాలలో ప్రచురితమవుతున్న సమాచారానికి సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రభుత్వం సంస్థాగత యంత్రాంగాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రెస్ కౌన్సిల్ చట్టం 1978 ప్రకారం నిర్దిష్ట పరిస్థితులలో ఏ వ్యక్తి పైనైనా పరువు నష్టం కలిగించే, అవమానకరమైన కథనాలు ప్రచురించకూడదని తెలిపారు. అలాగే డిజిటల్ మీడియా, ప్రైవేట్ శాటిలైట్ టీవీ చానళ్లలో వార్తల ప్రసారానికి సంబంధించి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ (నియంత్రణ) చట్టం 1995 ప్రకారం, నిర్దేశించిన నియమావళిని ఉల్లంఘించినట్లయితే అందుకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించడానికి మూడంచెల యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. వీటి ద్వారా సమస్య పరిష్కరించుకోవచ్చని చెప్పారు.



పార్లమెంట్‌లో పశ్నిస్తున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

భూములపై రైతులకు శాశ్వత హక్కులు



భూహక్కు పత్రాన్ని అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

కలువాయి: తాము సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములపై వారికి శాశ్వత హక్కులు కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి ఉమామహేశ్వరి కల్యాణ మండలంలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు హక్కుల పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులెవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, తదనుగుణంగా అధికారులు రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. రైతులు ఇక ధైర్యంగా తమ పొలాలను సాగు చేసుకోవచ్చని చెప్పారు. క్రయ విక్రయాలకు కూడా హక్కులు కల్పించామని తెలిపారు. మండలంలోని 650 మంది రైతులకు శాశ్వత హక్కు పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యజ్ఞపవన్, తహసీల్దార్ జి.స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

15న తిరుమలకు ఆకేపాటి పాదయాత్ర

తిరుపతి కల్చరల్: ఉమ్మడి కడప జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గోవింద మాల భక్తులతో కలిసి ఆయన ఈనెల 15వ తేదీన తిరుమలకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు నాక్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.శంకరయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆకేపాటి తిరుమల పాదయాత్ర పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలని కోరుతూ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ప్రతి ఏటా భక్తులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఇందులో భాగంగా 15వ తేదీ శుక్రవారం రాజంపేటి మండలం, ఆకేపాడులోని నవోదయ స్కూల్ వద్దనున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు గోవింద మాల భక్తులతో తిరుమలకు మహా పాదయాత్ర ప్రారంభించి, ఈనెల 17వ తేదీ సాయంత్రానికి కుక్కలదొడ్డి వద్దనున్న కేశవరెడ్డి స్కూల్ వద్దకు చేరుకుంటారన్నారు. రాత్రి అక్కడే బసచేసి 18వ తేదీ ఉదయం 6 గంటలకు అన్నమయ్య కాలిబాట నుంచి తిరుమలకు చేరుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో వీరంరెడ్డి, అనంతపద్మనాభరెడ్డి, డాక్టర్ రాజేశ్వరరావు, సతీష్‌చంద్ర పాల్గొన్నారు.



ఆకేపాటి పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శంకరయ్య, వీరంరెడ్డి, అనంత పద్మనాభరెడ్డి

తమిళనాడు మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్ : తమిళనాడు మద్యం విక్రయిస్తున్న సి.ఇంద్రమ్మ (50)అనే మహిళలను ఎస్ఈబీ చిత్తూరు రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బంగారుపాళ్యం మండలం సామిచేను మిట్ట గ్రామం వద్ద సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నిందితురాలు తమిళనాడుకు చెందిన 19 మద్యం బాటిళ్లతో పట్టుబడింది. తనిఖీల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, మమత, వెంకట్ పాల్గొన్నారు.

బోయకొండకు పోటెత్తిన భక్తులు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. కార్తీక మాసం చివరి రోజుతోపాటు అమావాస్య కావడంతో సహస్రనామార్చన పూజలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి, నూనెదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.